# గిరిజనులెవరూ కాంగ్రెస్‌కు ఓటేయొద్దు

## టీపీసీసీ ఆదివాసీ విభాగం చైర్మన్ భరత్ చౌహాన్




సమావేశంలో రేవంత్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

ఖైరతాబాద్, అక్టోబర్ 31: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి టికెట్లు అమ్ముకుంటున్న బాగోతాన్ని గిరిజనం గుర్తించాలని టీపీసీసీ ఆదివాసీ విభాగం చైర్మన్ భరత్ చౌహాన్ అన్నారు. గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30లక్షలకు పైగా గిరిజనుల జనాభా ఉంటే మూడు సీట్లు మాత్రమే కేటాయించారన్నారు.గిరిజనులకు కనీసం 12 శాతం సీట్లు కేటాయించాల్సి ఉందన్నారు. గోండు, ఆదివాసీల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న చోట్ల లంబాడీలకు, లంబాడీల జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో గోండులకు టికెట్లు ఇచ్చి ఇరు వర్గాల మధ్య రేవంత్ రెడ్డి చిచ్చు పెట్టాడన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూసి నేర్చుకోవాలని, తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల రిజర్వేషన్లు పెంచడంతో పాటు లంబాడీలకు ఏడు అసెంబ్లీ స్థానాలను కేటాయించిందన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని గిరిజనులందరూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్ రాథోడ్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్, డాక్టర్ రవినాయక్, చంద్రశేఖర్, నాగేంద్ర, లక్పతి తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానంతో ప్రాణదానం



హన్మాన్ రెడ్డి(46)

సిటీబ్యూరో, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ) : ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ... ఆ కుటుంబసభ్యులు పెద్ద మనసుతో అవయవదానానికి ముందుకు వచ్చారు. ఏపీలోని నెల్లూరు గౌతంనగర్‌కు చెందిన అనంతరెడ్డి, సంపూర్ణమ్మ కొడుకు హన్మాన్ రెడ్డి(46) హైదరాబాద్‌లో వ్యాపారి. ఈ నెల 29న తీవ్రమైన తలనొప్పితో సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్స్‌కి తరలించారు. మూడు రోజుల చికిత్స అనంతరం మంగళవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కిమ్స్ ఆసుపత్రిలోని అవయవదాన సమన్వయ కర్తలు, మృతుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు అవగాహన కల్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ఊపిరితిత్తులు, కిడ్నీలు, లివర్, కార్నియా దానం చేశారు. మృతుడికి భార్య విజయరెడ్డి, ఇద్దరు కొడుకులు ఉండగా, గ్రీన్ ఛానెల్ ద్వారా అవయవాలను తరలించినట్లుగా జీవన్‌దాన్ కమిటీ సభ్యులు వెల్లడించారు.

# ఇండియా డేటా పోర్టల్ ఆవిష్కరణ

సిటీబ్యూరో, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): అవసరమైన వారందరూ సులభంగా డేటాను పొందేలా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సంస్థ ఇండియా డేటా పోర్టల్ (ఐడీపీ) 2.0ను ప్రారంభించింది. భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీతో కలిసి రూపొందించిన ఇండియా డేటా పోర్టల్ జర్నలిస్టులు, పరిశోధకులు, విద్యార్థులు, విధాన రూపకర్తలు, ఇతరులు పోర్టల్‌లోని సమాచారాన్ని పొందేందుకు అవకాశం కల్పించారు. ఇండియా డేటా పోర్టల్ 2.0 ఒక వినూత్న ఫీచర్‌ను కలిగి ఉందని, ఇది వినియోగదారులు వారి డేటా సెట్‌లను అప్‌లోడ్ చేయడానికి అనుమతిస్తుందని భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్విని చాట్రే తెలిపారు.




కోఠి ఈఎన్‌టీ దవాఖానలో నిర్వహించిన వేడుకలలో పాల్గొన్న ఇంప్లాంట్ తెలంగాణ రాష్ట్ర నోడల్ ఆఫీసర్, కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్

# బధిర చిన్నారులకు కొత్త జీవితం

సుల్తాన్ బజార్, అక్టోబర్ 31 : క్లాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స పూర్తయిన చిన్నారులు సాధారణ పిల్లల తరహాలోనే మాట్లాడటం అందరినీ ఆశ్చర్యచకితులని చేసిందని ఇంప్లాంట్ తెలంగాణ రాష్ట్ర నోడల్ ఆఫీసర్, కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ టి. శంకర్ పేర్కొన్నారు. మంగళవారం దవాఖాన ఆడిటోరియంలో క్లాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స పూర్తయి 15 ఏండ్లు దాటిన చిన్నారులు, వారి తల్లి దండ్రులతో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బధిర చిన్నారులు చేసిన నృత్యాలు, పాడిన శ్లోకాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గాంధీ దవాఖాన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శోభన్‌బాబు, ప్రొఫెసర్‌లు డాక్టర్ ఆనందాచార్య, డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, డాక్టర్ లోక సుదర్శన్‌రెడ్డి, వినికిడి విభాగం సభ్యులు వీణ, గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రాజశ్రీ

# 18 ఏండ్లలోపు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

- చార్మినార్ జోన్ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రాజశ్రీ

సిటీబ్యూరో, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ) : 18ఏండ్లలోపు వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చార్మినార్ జోన్ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రాజశ్రీ పేర్కొన్నారు. చార్మినార్ జోన్ డీఎంహెచ్‌వో పరిధిలోని ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ బృందాలతో మంగళవారం ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 11 ఆర్‌బీఎస్‌కే ఆరోగ్య బృందాలు పాల్గొన్నాయి. 18 ఏండ్ల లోపు విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. పరీక్షలు నిర్వహించిన వారిలో పుట్టుకతో వచ్చిన లోపాల వల్ల వయసు పెరుగుతున్న కొద్దీ ఏర్పడే లోపాలు, ఎదుగుదల సరిగా లేని వాళ్లను ఈ స్క్రీనింగ్‌లో గుర్తించి ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు రిఫర్ చేసి ట్రీట్‌మెంట్ అందజేయాలని సూచించారు. ఆయా బృందాల్లో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఒక ఏఎన్ఎంతో పాటు ఒక ఫార్మాసిస్ట్ ఉంటారని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశానుసారం పుట్టుకతో సమస్యలు ఉన్న వాళ్లను గుర్తించి వాళ్లకు ఇన్‌టైంలో ట్రీట్‌మెంట్ అందేలా చేస్తామని ఈ సందర్భంగా సిబ్బంది పేర్కొన్నారు.

# నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సిటీబ్యూరో, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లై పథకం ఫేజ్-2లో భాగంగా పటాన్‌చెరు నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్‌సీ పంపింగ్ మెయిన్‌కు భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతు పనులు చేపట్టనున్నారు. నవంబర్ 1న ఉదయం 6గంటల నుంచి మరుసరి రోజు నవంబర్ 2న ఉదయం 6గంటల వరకు జరుగుతాయని తెలిపారు. 24గంటలు జలమండలి పరిధిలోని పలు డివిజన్లలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

**నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రాంతాలు ఇవే..**

1. ఓ అండ్ ఎం డివిజన్ – 6 : ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్‌పేట్ (లోప్రెజర్‌తో నీటి సరఫరా)
2. ఓ అండ్ ఎం డివిజన్– 8 : హఫ్ టెక్ పాయింట్లు, బల్క్ కనెక్షన్లు.
3. ఓఅండ్ ఎం డివిజన్ –9 : కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, భాగ్యనగర్‌కాలనీ, వసంత్‌నగర్.
4. ఓఅండ్ ఎం డివిజన్ –15 : ఆల్విన్‌పురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, దీప్తిశ్రీనగర్, మదీనగూడ, మియాపూర్.
5. ఓఅండ్ ఎం డివిజన్ –24 : బీరంగూడ, అమీన్‌పూర్, బొల్లారం

# సీఐఎస్ఎఫ్‌కు మిధాని రక్షణ బాధ్యతలు



సీఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న మిధాని డైరెక్టర్ కె. సంజయ్‌కుమార్ ఝా తదితరులు

సైదాబాద్, అక్టోబర్ 31 : కేంద్ర రక్షణ రంగ సంస్థ మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్ ( మిధాని) రక్షణ బాధ్యతలను బుధవారం నుంచి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌కు పర్యవేక్షిస్తుందని మిధాని డైరెక్టర్ కె. సంజయ్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం కంచన్‌బాగ్‌లోని మిధానిలో జరిగిన కార్యక్రమంలో రక్షణ బాధ్యతలను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌కు అప్పగించింది. ఈ సందర్భంగా మిధాని ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన సీఐఎస్ఎఫ్ జెండాను మిధాని డైరెక్టర్ కె. సంజయ్‌కుమార్ ఝా ఎగరవేశారు. సెరిమోనియల్ సెక్యూరిటీ తాళాలను సీఐఎస్ఎఫ్ సౌత్ జోన్ హెడ్ క్వార్టర్స్ డీఐజీ ఎం. నందన్‌కు అందజేశారు. అనంతరం సీఐఎస్ఎఫ్ కమాండోలు నైపుణ్యాల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్ గౌరీ శంకరరావు, ప్రొడక్షన్, మార్కెటింగ్ డైరెక్టర్ టి. ముత్తు కుమార్, జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) ఎ.రామకృష్ణారావు, ప్రణీత్ చంద్ర, (గ్రూప్ కమాండెంట్ ప్రణీత్ చంద్ర, సీనియర్ కమాండెంట్ మనీష్ సింగ్, మిధాని ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరస్పర ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న నల్సార్ లా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు, ఐకేపీ నాలెడ్జ్ పార్క్ చైర్మన్, సీఈవో డాక్టర్ దీపన్వితా చటోపాధ్యాయ

# నల్సార్, ఐకేపీ నాలెడ్జ్ పార్కు మధ్య ఒప్పందం

శామీర్‌పేట, అక్టోబర్ 31 : నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయం – ఐకేపీ నాలెడ్జ్ పార్కు మంగళవారం పరస్పర ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఒప్పంద పత్రాలపై నల్సార్ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు, ఐకేపీ నాలెడ్జ్ పార్కు చైర్మన్, సీఈవో డాక్టర్ దీపన్వితా చటోపాధ్యాయలు సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో ఐపీ నైపుణ్యం, నెట్‌వర్క్, ఔట్‌రీచ్, జాతీయ, అంతర్జాతీయ ఎక్స్‌పోజర్‌ను ఉపయోగించడంతో ఐపీ, సాంకేతిక నిర్వహణ, వాణిజ్యీకరణ డొమైన్‌లోని ప్రాజెక్టులపై అవగాహన పెంచుకోవచ్చున్నారు.

# ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ) : స్వాతంత్ర్య సమరయోధులు, ప్రథమ కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా 'జాతీయ ఐక్యతా దినోత్సవం' పోలీసు, ఏసీబీ శాఖల్లో మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏడీజీలు సౌమ్య మిశ్రా, శివధర్‌రెడ్డి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఏసీబీ కార్యాలయంలో ఆ శాఖ డీజీ రవిగుప్తా.. జేడీలు, డీడీలు, డీఎస్పీలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు జానకి షర్మిల, అనసూయ, రామమూర్తి, రాఘవులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, డీఎస్పీలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
EE, సర్కిల్ -30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్
GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 32/EE-30/SDZ/GHMC/2023-2024, తేది: 31-10-2023 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ప్రచురించబడినది. వివరాలను https://tender.eprocurement.gov.in లాగిన్ అవడం ద్వారా చూడవచ్చును. ఈవెంట్ల తేదీలు దిగువ వివరించబడినవి: NIT No. 32/EE-30/SDZ/GHMC/2023-2024, తేది: 31-10-2023. పని పేరు: GHMC, సికింద్రాబాద్ జోన్, బేగంపేట్ సర్కిల్-30, రామ్‌గోపాల్‌పేట్ వార్డ్ 148లో బుద్ధ భవన్, నార్త్ బ్లాక్, 5వ అంతస్తు వద్ద ప్రస్తుతంగల ఛాంబర్స్‌కు ఫర్నీచర్, ఎయిర్ కండిషనర్లు ఏర్పాటు మరియు మైనర్ మరమ్మతు పనులకు హాజరగుట (నిర్వహణ పని క్రిందకు వస్తుంది)-1 పని. అంచనా మొత్తం లక్షలలో: 27.50. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం/బిడ్ దాఖలుకు ముగింపు తేది & సమయం: 02-11-2023న మ|| 2.00 గం./06-11-2023న మ|| 2.00 గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నెం: E.E-సర్కిల్-30, GHMC, సికింద్రాబాద్. సెల్ నెం: 9849906750. సంబంధిత అధికారి చిరునామా: శ్రీ సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్, GHMC. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్: https://tender.telangana.gov.inలో చూడవచ్చును.

DIPR RO.No. 8217-PP/CL/ADVT/1/2023-24, Dt: 31-10-2023 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సర్కిల్-30, బేగంపేట్.